నాణ్యతా లోపం.. ప్రజలకు శాపం

- రూ.కోటి వెచ్చించినా కొన్నాళ్లకే శిథిలమవుతున్న రోడ్లు
- పనుల్లో నాణ్యత లోపించడంతో పగుళ్లు తేలుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

దండేపల్లి: అభివృద్ధి పనులు చేపడితే పది కాలాల పాటు ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలి. అధికారులు పర్యవేక్షణ లోపం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో కోట్లు వెచ్చించి చేసిన పనులు కొన్నాళ్లకే శిథిలమవుతున్నాయి. దండేపల్లి మండలంలోని లింగాపూర్ నుంచి గుడిరేవు వరకు గల బీటీ రోడ్డు మరమ్మతులతో పాటు, గుడిరేవు ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ స్టాచ్ వరకు సీసీరోడ్డు నిర్మాణానికి 2015–16 సంవత్సరంలో రూ.101.20లక్షలు మంజూరు చేసింది. బీటీ రోడ్డు మరమ్మతులతో పాటు, సీసీరోడ్డు నిర్మించి సుమారు ఐదేళ్లు గడిచే సరికే బీటీ రోడ్డు ఆనవాళ్లు లేకుండా పూర్తిగా శిథిలమైంది. సీసీరోడ్డు మొత్తం పగుళ్లు తేలింది. రూ.కోటి వెచ్చించి చేసిన పనులు కొద్దిరోజులకే ఇలా పాడైపోతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నడక నరకయాతన..

లింగాపూర్ గుడిరేవు బీటీ రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం గుడిరేవు, అల్లీపూర్, బిక్కనగూడ, కశపల్లి గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం మేదరిపేటకు వస్తుంటారు. దీంతో వారు ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా ఇదే రోడ్డుగుండా రావాల్సి ఉంటుంది. రోడ్డు మొత్తం శిథిలం కావడంతో నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల ప్రజలతో పాటు, ఏటా గుడిరేవు గోదావరి ఒడ్డున గల పద్మల్‌పురి కాకో ఆలయంలో నిర్వహించే దండారి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు వస్తుంటారు. రోడ్డు శిథిలం కావడంతో భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఏడాది క్రితం బీటీ రెన్యూవల్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. లింగాపూర్ నుంచి గుడిరేవు సుమారుగా 4కిలోమీటర్ల దూరం ఉంటుంది.. కానీ కేవలం కిలోమీటరు వరకు మాత్రమే బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరు చేశారు. కానీ మధ్యలో మరో రెండు కిలోమీటర్ల వరకు మళ్లీ రోడ్డంతా గుంతల మయంగానే ఉంటుంది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి, లింగాపూర్ నుంచి గుడిరేవు వరకు కొత్త బీటీరోడ్డు నిర్మించి, పది కాలాల పాటు మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు నడవడంతోనే..

ఈ రోడ్డు గుండా ఇసుక ట్రాక్టర్లు, గతంలో కొన్ని సందర్భాల్లో టిప్పర్లు కూడా నడిచాయి. లోడ్ వాహనాలు అధికంగా నడవడంతోనే రోడ్డు కుంగిపోయి, గుంతలు పడి రోడ్డంతా పాడయ్యిందని స్థానికులు పేర్కొంటున్నారు.



లింగాపూర్ గుడిరేవు మధ్య శిథిలమైన బీటీ రోడ్డు



అల్లీపూర్ గుడిరేవు మధ్య పగుళ్లు తేలిన సీసీరోడ్డు

త్వరలో బీటీ రెన్యూవల్ పనులు

లింగాపూర్–గుడిరేవు రోడ్డుకు కిలోమీటరు మేర బీటీ రెన్యూవల్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన పనులు త్వరలో చేపడుతాం. మిగితా రోడ్డుకు నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. లోడ్ వాహనాలు నడవడంతోనే రోడ్లు త్వరగా పాడవుతున్నాయి.

– తివారీ, పీఆర్ ఏఈ, దండేపల్లి

దండారీ ఉత్సవాల్లో జాన్సన్‌నాయక్



దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న జాన్సన్‌నాయక్



ఖానాపూర్: పార్టీలో చేరిన వారితో జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ మండలంలోని హీరాపూర్(జే), కొలాంగూడ, మత్తడిగూడ, కన్నాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. దండారీ సభ్యులతో కలిసి కోలాటం ఆడారు. దండరీ ఉత్సవాలకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి..

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని నీటి పారుదల శాఖ చైర్మన్ వేణుగోపాల్‌చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభా సాయినాథ్, బీఆర్‌ఎస్ నాయకులు పుర్ణచందర్ నాయక్, కనక తుకారం, పెందోర్ ప్రభాకర్, పెందోర్ పుష్పరాణీ పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలి

ఖానాపూర్: ప్రజల సమస్యలు తెలిసిన జాన్సన్ నాయక్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ ఎస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమాల్లో గోపాల్, వాల్‌సింగ్, వెంకటేశ్వర్, రవీందర్, తిరుపతి, అశోక్, ప్రసాద్, నవీన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కరీంకాలనీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీలోని ఫైసల్, వాసేఖాన్, ఉస్మాన్, వాహబ్, ఆమెర్, సద్దాం, సోను, సోయబ్, సన్న, సలీం, ముసదిక్, ఉమేర్, ఫేరోజ్, వాహబ్, రహీల్, జలీల్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పరిమి సురేశ్, ఖలీల్, శ్రీనివాస్, ఇర్ఫాన్, షోయబ్, కిశోర్, సత్యనారాయణ, సంతోశ్, మెహరాజ్, నసీర్ తదితరులున్నారు.

ప్రయోగశాల ప్రారంభం



విద్యార్థులతో మాట్లాడుతున్న గంగారాం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలోని ఆధునిక ప్రయోగశాలను జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మడావి గంగారాం శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు రాబోవు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, శ్రద్ధగా చదువుకోవాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక ప్రయోగశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు సైన్స్, రోబోటిక్స్ ఇతర పరికరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలోని పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శంకర్, ప్రధానోపాధ్యాయులు గఫార్, సంరక్షణాధికారిణి శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్‌పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. హాజీపూర్ ఎస్సై నరేశ్ కుమార్, చెక్‌పోస్ట్ ప్రత్యేక అధికారులు సీడీపీఓ హేమసత్య, ఏఎస్సై రాజేశ్‌లతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు వాహనాలను నిలిపి తనిఖీలు జరిపారు. ఈ చెక్‌పోస్ట్‌లో రోజుకు 500 వరకు వాహనాలను సోదాలు నిర్వహిస్తుండగా, ప్రతీ కారును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంచిర్యాల నుంచి హాజీపూర్ మండలం దాటి వెళ్తున్న వాహనాలను ఆపి మరీ తనిఖీ చేపడుతున్నారు. చెక్‌పోస్ట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఎన్నికల కమిషన్‌కు అనుసంధానం చేసి ఉండగా వాహనాల తనిఖీ ప్రక్రియను పూర్తి వీడియోగా చిత్రీకరిస్తున్నారు.

ఘనంగా జెండా పండగ



జెండా పండగలో పాల్గొన్న ఎస్సై, ముస్లింలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఈద్గా వద్ద శుక్రవారం గ్యార్మీ షరీఫ్(జెండా పండుగ)ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జామా సమాజ్ తర్వాత ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో జెండాను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

లక్సెట్టిపేట: మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని మండల ఎంపీపీ అన్నం మంగ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారులు మండలంలో ఇప్పటి వరకు నిర్వహించిన పనులు, భవిష్యత్‌లో చేయబోయే పనులను వివరించారు. ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో అభివృద్ధి పనులు, సమస్యలపై ఎలాంటి చర్చలు జరుగలేదు. నామమాత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న విప్, ఎంపీ

జైపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు, బీఆర్ ఎస్ పార్టీ జైపూర్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు తండ్రి బల్మూరి తిరుమంగళరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా శుక్రవారం బల్మూరి అరవీందర్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేశ్‌నేతతో కలిసి పరామర్శించి తిరుమంగళరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

స్వీయ పరిశోధనలకు 'బాలల సైన్స్ కాంగ్రెస్'



విద్యార్థులతో డీఎస్‌వో, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి క్షేత్రస్థాయిలో స్వీయ పరిశోధన, సమస్యల పరిష్కారం కోసం బాలల సైన్స్ కాంగ్రెస్ ఎంతో దోహదం చేస్తుందని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా సైన్స్ కేంద్రంలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి మేళాను శుక్రవారం డీఈవో యాదయ్య, సెక్టోరల్ సమన్వయ కర్త చౌదరితో కలిసి ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 62 ప్రాజెక్టులు ప్రదర్శించి, నాలుగు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, జిల్లా ఎన్సీఎస్సీ సమన్వయ కర్త శ్రీ మూర్తి, న్యాయనిర్ణేతలుగా రాజగోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకుమార్, రిసోర్స్ పర్సన్ రాజేశం, మల్లాగౌడ్, జిజ్ఞాస నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



కన్నెపల్లిలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం



నెన్నెలలో అవగాహన కల్పిస్తున్న కళాబృందం

నెన్నెల: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళాబృంద సభ్యులు బీఎల్‌ఓలు, ఐకేపీ వీఓఏలకు శుక్రవారం అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాటలు, నృత్యాల ద్వారా వివరించారు. ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. వంద శాతం పోలింగ్ అయ్యే విధంగా చూడాలని బీఎల్‌ఓలు, వీఓఏలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మి, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ముల్కళ్ల మురళి, పోశం, లచ్చన్న, లింగంపల్లి రాజేష్, నాగలక్ష్మి, నిరోశలు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో ఓటు హక్కుపై అవగాహన

భీమిని: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఓటు హక్కుపై పాటల ద్వారా కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీలు, వీఓఏలు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మురళి, పోశం, లచ్చన్న, రాజేష్, నాగలక్ష్మి, నిరోశ, బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా



సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీఓ వరలక్ష్మి

నెన్నెల: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. తిరిగి సమావేశం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు బుచ్చమ్మకు శివసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.4 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, సభ్యులు శ్రీకాంత్, సుమతమ్మ, శ్రీనివాస్, తిరుపతి, ప్రభాకర్, వినోద్ పాల్గొన్నారు.

ప్రయాణికుల రక్షణకు 'అభయ్'



దేవాపూర్‌లో ఆటోలకు స్టిక్కర్లు వేస్తున్న సీఐ

కాసిపేట: ప్రయాణికుల రక్షణకు అభయ్ ఆప్ పనిచేస్తుందని, ఆపద సమయంలో వాడుకోవాలిృందిగా మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోలకు స్టిక్కర్లు అంటించడంతో పాటు డ్రైవర్లకు పంపిణీ చేశారు. రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు.. స్కానర్‌తో ఉన్న అభయ్ ఆఫ్ స్టిక్కర్లు అంటిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా డ్రైవర్లు ఆకతాయి పనులకు, వేధింపులకు పాలృడినట్లైతే సంబంధిత ప్రయాణికులు సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేసినట్లయితే లొకేషన్‌తో పాటు ఆటో పూర్తి వివరాలు పోలీస్‌శాఖకు అందుతాయని, వెంటనే సిబ్బంది ద్వారా సమస్య పరిష్కారానికి కృషిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, ఆటోడ్రైవర్లు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుమూల, సమస్యాత్మకమైన, మావోయిస్టు ప్రాభల్యం ఉన్న గత్రావుపల్లి, సోనాపూర్, వెంకటపూర్, రొట్టెపల్లి, ధర్మరావుపేట, దేవాపూర్ పోలింగ్ స్టేషన్‌లను శుక్రవారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరు సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలో విద్యుదాఘాతంతో మేక మృతి చెందింది. దుర్కి కత్తెరశాల అనే వ్యక్తికి చెందిన మేక శుక్రవారం మేత కోసం గ్రామ సమీపంలోని పంట చేళ్ల వైపు వెళ్లింది. ఎర్త్‌వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.12 వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు



మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీపూజ నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. టపాసులు కాల్చారు. దీపావళి పండుగ విశిష్టతపై పాఠశాల కరస్పాండెంట్ జోబిన్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీన నాగేశ్వర్, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న మేనేజర్ శివశంకర్

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం నీల్వాయి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివశంకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆధార్ అనుసంధానం చేసుకొని వేలిముద్రల సాయంతో గ్రామీణ బ్యాంకు సీ ఎస్‌పీ సెంటర్ల ద్వారా లావాదేవీలు చేసుకోవాలని, దిశ యాప్ ద్వారా మొబైల్‌లో ఖాతా తీసుకోవచ్చని అన్నారు. డిజిటల్ లావాదేవీలు జరిపేవారు తమ పాస్‌వర్డ్ ఎవరికి తెలియజేయకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి తెలిపారు. ఈ నెల 9వ తేదీన మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీల్లో అలేఖ్య సంగీతం విభాగంలో, నిస్సి శాస్త్రీయ వాద్య సంగీతం విభాగం నుంచి ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు.

'బీఫామ్‌లను అమ్ముకునే దౌర్భాగ్య స్థితికి దిగజారారు'

బెల్లంపల్లి: బీజేపీ రాష్ట్ర నాయకత్వం బీ ఫామ్‌లను అమ్ముకునే దౌర్భాగ్య స్థితికి దిగజారారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ తీవ్రంగా విమర్శించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీకోసం చిత్తశుద్ధితో పనిచేసిన తనకు కాదని, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవికి టికెట్ కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. తన అనుచరులతో శనివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన తెలిపారు.

ఆలోచించి ఓటు వేయాలి

మందమర్రిరూరల్: అన్ని రాజకీయ పార్టీలు సిద్ధాంతాలు మరిచాయని, ప్రతి ఓటరూ చైతన్యవంతులై ఓటు వేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి తదితర వక్తలు వివరించారు. మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం తెలంగాణ సమాఖ్య ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన కల్పించారు.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట: మండలంలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలు చౌడుగూడ, చిక్రంగూడ, కొత్తగూడ, ముత్యంపల్లి, లంబాడితండా గ్రామాల్లోని పేదలకు శుక్రవారం భూపాలపల్లికి చెందిన గాజుల అరుణ్‌కుమార్ దుప్పట్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హాజీపూర్ మండల ఏఈ మహేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, రాంపూర్, హాజీపూర్ గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ముల్కల్ల సబ్ స్టేషన్ పరిధిలో..

ముల్కల్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం సబ్ స్టేషన్ నిర్వహణ, చెట్ల కొమ్మల కటింగ్ పనులు ఉన్నందునా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంచిర్యాల టౌన్ ఏఈ సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముల్కల్ల, వేంపల్లి గ్రామాలతో పాటు ముల్కల్ల పంప్‌హౌస్‌కు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పవర్‌కట్ ప్రాంతాలు




మందమర్రిరూరల్: మందమర్రి పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్, అందుగులపేట పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేస్తున్నందునా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జీఎం ఆఫీస్ ఏరియా యాపల్, కేకే–2 ఏరియా, ఊరు మందమర్రి, మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, పాలచెట్టు ఏరియా, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావుపల్లె, బొక్కలగుట్ట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ తెలిపారు.

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ పరిధి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందునా శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గణేష్ తెలిపారు. జెండావెంకటాపూర్, బలరావుపేట, తిమ్మాపూర్ గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

దండేపల్లి: దండేపల్లి, ముత్యంపేట విద్యుత్ సబ్ స్టేషన్లలో నిర్వహణ మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాయనర్సు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కాసిపేట: మండలంలోని కొండపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో, 33కేవీ ఫీడర్‌లో మరమ్మతులు(నిర్వహణ)చేస్తున్నందునా కాసిపేట మండలంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

వివేక్‌ను కలిసేందుకు వచ్చిన ఉపాధ్యాయుడి అడ్డగింత



ఉపాధ్యాయున్ని పంపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

చెన్నూర్: పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడు హిమవంత రెడ్డి ఇంట్లో చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానంద్ అద్దెకుంటున్నారు. కోటపల్లి మండలం అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కోర్మాల్ల రాంరెడ్డి శుక్రవారం రాత్రి వివేకానంద్‌ను కలిసేందుకు రాగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. నిన్న మొన్నటి వరకు అధికార పార్టీ వ్యక్తుల వద్ద ఉంటూ, నేడు వివేక్‌ను కలువడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుబట్టారు. దీంతో ఉపాధ్యాయుడు రాంరెడ్డి అక్కడి నుంచి జారుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.